


మరోసారి తెరపైకి కరుణ !
రెండు సార్లు ఎంపీపీగా పనిచేసిన బషీరాబాద్ మండల మాజీ అధ్యక్షురాలు కరుణ హాట్రిక్‌పై కన్నేశారు. 8లో▸



కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు
స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని దుద్యాల్ ఎస్ఐ యాదగిరి హెచ్చరించారు. 8లో▸



కాగితాలకే పరిమితం!
ప్రభుత్వ సంస్థల పనితీరుపై పర్యవేక్షణ కోసం నియమించిన కమిటీలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. 9లో▸

న్యూస్‌రీల్

అఖిల్ యాదవ్‌కు ఉచిత మెడికల్ సీటు



కొడంగల్: పట్టణానికి చెందిన అఖిల్ యాదవ్ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎస్‌వీఎస్ మెడికల్ కళాశాలలో ఏ కేటగిరీ జనరల్ కోటాలో ఉచితంగా మెడికల్ సీటు సాధించాడు. శనివారం కళాశాలలో అడ్మిషన్ తీసుకున్నట్లు అఖిల్ యాదవ్ తండ్రి ఏవీ పృథ్వి రాజ్ తెలిపారు. నీట్‌లో ర్యాంక్ రావడంతో ఎంబీబీఎస్ సీటు ఉచితంగా వచ్చిందన్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీ పరీక్షల్లో 469 మార్కులు రావడంతో కాళోజీ నారాయణరావ్ యూనివర్సిటీ ఎంబీబీఎస్ సీటు కేటాయించింది. సెకండ్ ఫేజ్ కౌన్సిలింగ్‌లో మహబూబ్‌నగర్‌లోని ఎస్‌వీఎస్‌లో సీటు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అఖిల్ యాదవ్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పృథ్విరాజ్, అనంతలక్ష్మీ సహకారం, ప్రోత్సాహంతో సీటు సాధించినట్లు చెప్పారు. భవిష్యత్తులో వైద్య వృత్తిలో స్థిరపడి రోగులకు సేవ చేయనున్నట్లు తెలిపారు.

రూ.లక్ష పలికిన చీరలు



దుర్గమ్మ చీరతో సందప్ప దంపతులు

దుద్యాల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాత ధరించిన చీరలకు శనివారం వేలం నిర్వహించారు. మండలంలోని హస్నాబాద్‌లో మూడు చోట్ల అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అక్కడ చీరలకు వేలం నిర్వహించారు. గౌడ్స్ కాలనీలో బాలగౌడ్ రూ.1.15 లక్షలకు దుర్గమ్మ చీరను సొంతం చేసుకున్నారు. గాంధీ చౌక్‌లో గోపాల్ ఆనంద్ రూ.1.17 లక్షలకు, వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద బీ సందప్ప రూ.95 వేలకు అమ్మవారి చీరను దక్కించుకున్నారు.

టెంట్ హౌస్ దగ్ధం

- మరో రెండు షాపులకు పాక్షికంగా మంటలు
- అదుపు చేసిన ఫైర్ సిబ్బంది



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

తాండూరు టౌన్: ప్రమాదవశాత్తు ఓ టెంట్ హౌస్ దుకాణం అగ్నికి ఆహుతైంది. షాపులోని సామగ్రి మొత్తం కాలి బూడిదైంది. ఈ ఘటన శనివారం తాండూరు పట్టణంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన నసీర్ అనే వ్యక్తి ఓ షెట్టర్‌లో ఎంఎస్ టెంట్ హౌస్ నిర్వహిస్తున్నాడు. షెట్టర్ నుంచి దట్టమైన పొగ, మంటలు రావడాన్ని గమనించిన స్థానికులు వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం చేరవేశారు. వారు వచ్చి మంటలను ఆర్పేశారు. అప్పటికే దుకాణంలోని సామగ్రి కాలిపోయింది. పక్కనే ఉన్న ఆటోమొబైల్ షాపు, వెల్డింగ్ షాపులకు కూడా నిప్పంటుకుంది. ఫైర్ సిబ్బంది మంటలు వ్యాపించకుండా అడ్డుకున్నారు. ఎవరో కావాలనే నిప్పు పెట్టి ఉంటారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ ప్రమాదంతో రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు యజమాని నసీర్ తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు

సమన్వయంగా ఎన్నికల నిర్వహణ



మాట్లాడుతున్న ఎంపీడీఓ బన్సీలాల్

షాద్‌నగర్ రూరల్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎంపీడీఓ బన్సీలాల్ అన్నారు. రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్, జోనల్, రూట్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద అన్ని వసతులు కల్పిస్తామని చెప్పారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ నామినేషన్ల స్వీకరణకు ఐదు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. తహసీల్దార్ నాగయ్య మాట్లాడుతూ.. చనిపోయిన వారిపేర్లను ఓటరు జాబితా నుంచి తొలగిస్తామన్నారు. పట్టణ సీఐ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చూస్తామన్నారు.

పీఠంపై గురి..!



జెడ్పీ చైర్మన్ పదవే టార్గెట్‌గా పోరుకు సిద్ధమవుతున్న పార్టీలు

- ఇప్పటి వరకు కాంగ్రెస్‌కు దక్కని అవకాశం
- ఈ సారి ఎలాగైనా సొంతం చేసుకోవాలనే ఆలోచనలో హస్తం పార్టీ
- గత సంప్రదాయం కొనసాగించాలని చూస్తున్న బీఆర్ఎస్
- రేసులో తాము సైతం అంటున్న కమలం పార్టీ
- ఆశావహుల సంఖ్య భారీగానే..
- పోటీకి సై అంటున్న పలువురు ముఖ్య నేతలు

వికారాబాద్: ఈ సారి ఎలాగైనా జెడ్పీ పీఠం తమ ఖాతాలో వేసుకోవాలనే పట్టుదలతో ప్రధాన పార్టీలన్నీ పావులు కదుపుతున్నాయి. ఏడాది కాలంగా ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలు రానే వచ్చాయి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కేటాయింపు కల కూడా సాకారమైంది. చైర్మన్ పదవి బీసీకి రిజర్వయిన నేపథ్యంలో ఆ సామాజిక వర్గంలో ఆశావహుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. జిల్లాలో అత్యధిక ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలను బీసీలకు కేటాయించారు. చైర్మన్ స్థానం కూడా బీసీ జనరల్‌కు కేటాయించడంతో ఆయా పార్టీలు బలమైన నేతల కోసం గాలిస్తున్నాయి. తాజా రిజర్వేషన్ల ప్రకారం 20 మండలాల్లో 8 జెడ్పీటీసీ స్థానాలను బీసీలకు కేటాయించారు. ఇందులో ఏదో ఒక మండలం నుంచి పోటీ చేయించి జెడ్పీ పీఠాన్ని దక్కించుకోవాలని ఆయా పార్టీలు ప్లాన్ చేస్తున్నాయి. ఆశావహులు కూడా తమకే పదవి వరిస్తుందని ప్రచారం చేసుకోవడం మొదలు పెట్టారు. పీఠంపై కన్నేసిన నేతలు ఒకరికి తెలియకుండా ఒకరు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. మండల, జిల్లా పరిషత్‌లు ఏర్పాటైంది మొదలు ఉమ్మడి జిల్లాలోగానీ, ప్రస్తుత వికారాబాద్ జిల్లాలో గానీ అధికార కాంగ్రెస్ పార్టీ ఒక్కసారి కూడా పీఠాన్ని దక్కించుకోలేకపోయింది. టీడీపీ, బీఆర్ఎస్‌కే అవకాశం దక్కింది. ప్రస్తుతం జిల్లా నుంచి సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్ ప్రాతినిధ్యం వహిస్తుండటం.. మిగిలిన ఇద్దరు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌కు చెందిన వారే కావడంతో జెడ్పీ పదవి తమకే దక్కుతుందని ఆ పార్టీ నేతలు దీమాగా ఉన్నారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ గత సంప్రదాయం కొనసాగించాలని.. ఎలాగైనా చైర్మన్ పదవి సొంతం చేసుకోవాలని చూస్తోంది.

కాంగ్రెస్‌లో ఆశావహులు అధికం

గతంతో పోలిస్తే ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి సానుకూల పరిస్థితులు కనిపిస్తున్న నేపథ్యంలో ఆ పార్టీలో పోటీ అధికమైంది. ప్రతి నియోజకవర్గం నుంచి పలువురు నేతలు పోరుకు సిద్ధమవుతు న్నారు. కొడంగల్‌కు చెందిన మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ కుటుంబం నుంచి ఎవరైనా పోటీపడే అవకాశం ఉంది. పరిగి నుంచి పార్టీ సీనియర్ నాయకులు హన్మంతు ముదిరాజ్, లాల్‌కృష్ణప్రసాద్ బరిలో ఉన్నారు. ఎమ్మెల్యే టీఆర్ఆర్‌కు నమ్మిన బంటు అయిన దోమ మండలానికి చెందిన రజిత భాస్కర్‌గౌడ్ సైతం పదవి ఆశిస్తున్నారు. తాండూరు నియోజకవర్గం నుంచి మహారాజుల కుటుంబం నుంచి జిల్లా పరిషత్ పీఠాన్ని ఆశిస్తోంది. సంపత్, మురళీగౌడ్ సైతం రేసులో ఉన్నట్లు తెలుస్తోంది.

పట్టు నిలుపుకోవాలని చూస్తున్న బీఆర్ఎస్

జిల్లా ఏర్పాటైన తర్వాత వరుసగా రెండు సార్లు జెడ్పీ పీఠాన్ని కైవసం చేసుకున్న బీఆర్ఎస్.. మరో సారి ఆ సంప్రదాయాన్ని కొనసాగించాలనే ఆలోచనలో ఉంది. గత ఎన్నికల్లో ఒక్కటి మినహా అన్ని జెడ్పీటీసీ స్థానాలను కైవసం చేసుకుని పీఠాన్ని దక్కించుకుంది. ఈ సారి కూడా అదే పంథా కొనసాగించాలని చూస్తోంది. ఈ విషయమై జిల్లాకు చెందిన నలుగురు మాజీ ఎమ్మెల్యేలు శనివారం వికారాబాద్‌లో సమావేశమై చర్చలు జరిపారు. అయితే వికారాబాద్‌కు చెందిన బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నగేందర్‌గౌడ్ పోటీలో ఉండాలనే యోచనలో ఉన్నారు. తాండూరుకు చెందిన రాజుగౌడ్, కొడంగల్‌కు చెందిన దామోదర్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కృష్ణ తదితరులు పీఠంపై కన్నేసిన వారిలో ఉన్నారు. బీజేపీ సైతం సత్తాచాటాలని ఆశపడుతోంది. పరిగి, తాండూరు, వికారాబాద్ నియోజకవర్గాలకు చెందిన పలువురు నేతలను పోటీలో ఉంచేందుకు సిద్ధమవుతోంది.

మద్దతు కూడగట్టే పనిలో..

జెడ్పీ పీఠంపై కన్నేసిన నేతలు ముఖ్య నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు. ఇప్పటికే వారి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ద్వితీయ శ్రేణి నాయకులు ఆయా నియోజకవర్గాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేల అండదండలు పొందడానికి, స్థానిక నాయకుల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. కొందరు నేతలు నేరుగా అధిష్టానంతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. పరిణామాలు, సమీకరణలు ఎలా ఉన్నా జిల్లా పరిషత్ అభ్యర్థులను నిర్ణయించడంలో ఆయా పార్టీల అధినాయకత్వం పాత్ర కీలకం కానుందనే ప్రచారం జరుగుతోంది.

'చైర్మన్ పదవి బీఆర్ఎస్‌దే'



సమావేశమైన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు

అనంతగిరి: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జెడ్పీ చైర్మన్ పదవిని బీఆర్ఎస్ కైవసం చేసుకుంటుందని ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యేలు ధీమా వ్యక్తం చేశారు. శనివారం వికారాబాద్ పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ నివాసంలో మాజీ ఎమ్మెల్యేలు నరేందర్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి సమావేశమయ్యారు. ముందుగా ఒకరికొకరు జమ్మి ఆకు ఇచ్చుకొని దసరా పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. అనంతరం జిల్లా రాజకీయాలు, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై సుదీర్ఘంగా చర్చించారు. జెడ్పీ చైర్మన్ పదవి సొంతం చేసుకునేలా ముందుకు సాగాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. అందుకు కార్యాచరణ రూపొందించుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. త్వరలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసి చర్చిస్తామని వారు తెలిపారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కాంగ్రెస్ మోసాలను ఎండగట్టండి

- హామీల అమలులో ప్రభుత్వం విఫలం
- మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కొడంగల్: ప్రతి ఇంటికీ వెళ్లి కాంగ్రెస్ మోసాలను ప్రజలకు వివరించాలని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. శనివారం ఆయన నియోజకవర్గంలో పర్యటించారు. ప్రజలు, పార్టీ శ్రేణులకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని సూచించారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఓట్లు ఎలా అడుగుతారని ప్రశ్నించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు గెలుపే లక్ష్యంగా సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ఎకరానికి రూ.15 వేలు, మహిళలకు రూ.2,500, వృద్ధులు, వితంతువులకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు ఇవ్వలేదన్నారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల జాడేలేదన్నారు. తులం బంగారం ఏమయ్యిందో ప్రజలకు చెప్పాలన్నారు. ఆరు గ్యారంటీల అమలులో ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్ తప్పిదాలను బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, నాయకులు మధుయాదవ్, రమేష్ బాబు, మధుసూదన్‌రెడ్డి, నర్మద కిష్టప్ప, రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ కార్యాలయం ముట్టడి



ఎక్సైజ్ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

- బెల్టు షాపులు మూసి వేయాలని మహిళల ఆందోళన
- లేకుంటే ఆఫీసుకు తాళం వేస్తామని హెచ్చరిక

తాండూరు టౌన్: పట్టణంలోని పాత తాండూరులో కొనసాగుతున్న బెల్టు షాపులను వెంటనే మూసి వేయాలని డిమాండ్ చేస్తూ మహిళలు ఎక్సైజ్ కార్యాలయం ఎదుట శనివారం ఆందోళనకు దిగారు. స్థానికులతో కలిసి కార్యాలయాన్ని ముట్టడించారు. షాపులను సీజ్ చేయడంతోపాటు యజమానులపై చర్యలు తీసుకోవాలని,ద లేకుంటే ఆఫీసుకు తాళం వేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పాత తాండూరులో ఏర్పాటు చేసిన బెల్టు షాపుల కారణంగా కాపురాలు కూలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక మంది మద్యం సేవించి అనారోగ్యం పాలవుతున్నారని, కొందరు మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూలి పని చేయగా వచ్చిన డబ్బంతా మద్యానికే వెచ్చిస్తున్నారని తమ గోడు వెల్లబోసుకున్నారు. అంతేకాకుండా నిత్యం ఇంట్లో గొడవలు జరుగుతున్నాయంటూ మహిళలు తెలిపారు. గతంలో ఓ వ్యక్తి బెల్టు షాపులో మద్యం సేవించి మృతి చెందాడని గుర్తు చేశారు. అంతేకాకుండా షాపు యజమానులు తమపై బెదిరింపులకు దిగుతున్నారని పోలీసులకు వివరించారు. బెల్టు షాపులను తొలగించాలని గతంలో పలుమార్లు తాండూరు ఎక్సైజ్ అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా ఫలితం లేదన్నారు. మామూళ్ల మత్తులో జోగుతున్న అధికారులు తమ విన్నపాన్ని పట్టించుకోవడం లేదని విమర్శించారు. వెంటనే చర్యలు తీసుకోవాలని లేకుంటే ఉద్యమం చేపడతామని మహిళలు హెచ్చరించారు.



గ్రామస్తుల నుంచి వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

పరస్పర దాడిపై కేసు నమోదు

- విచారణ చేపట్టిన డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

తాండూరు రూరల్: మండలంలోని సంగెంకలాన్ గ్రామంలో శనివారం రాత్రి తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి విచారణ చేపట్టారు. శుక్రవారం రాత్రి ఇద్దరి యువకుల మధ్య జరిగిన గొడవ రెండు వర్గాల దాడులకు దారి తీసిన విషయం తెలిసిందే. ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో డీఎస్పీ గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద స్థానికులతో సమావేశమై గొడవకు గల కారణాలు తెలుసుకున్నారు. కొంత మంది నాయకుల మాటలు విని యువకులు తరచూ గొడవ పడుతున్నారని స్థానికులు తెలిపారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిడికి తలొగ్గి 11 మందిపై కేసు నమోదు చేశారని ఆరోపించారు. మమ్మల్ని కూడా జైల్లో పెట్టాలని ఆవేదన వ్యక్తం చేశారు. కావాలని గొడవలు సృష్టిస్తే గ్రామం విడిచి పోవడం తప్ప వేరే మార్గం లేదన్నారు. అనంతరం ఎస్ఐ రాథోడ్ వినోద్ మాట్లాడుతూ.. దాడులకు పాల్పడ్డ కాళ్ల సంజీవ్‌రెడ్డి, కాళ్ల సాయిరెడ్డి, రత్నాకర్, సిద్ధి లింగారెడ్డి, కామిని శ్రీనివాస్, కామిని నరేందర్, కె.దశరథ్, కామిని అనిల్, అరె కృష్ణ, వడ్డె ప్రవీణ్, వడ్డె బస్వరాజ్‌పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశామని తెలిపారు. విచారణ కొనసాగుతోందన్నారు. యువకుల ఘర్షణపై మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి పోలీసు అధికారులతో మాట్లాడినట్లు సమాచారం.

ప్రజావాణి రద్దు

- కలెక్టర్ ప్రతీక్‌జైన్



అనంతగిరి: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికలు పూర్తయ్యే వరకు కార్యక్రమం ఉండదని తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించి సహకరించాలని కోరారు. అర్జీలతో ఎవరూ కలెక్టరేట్‌కు రావొద్దని సూచించారు.

పెళ్లికి నిరాకరించిన యువకుడు

- యువతి ఆత్మహత్య

అనంతగిరి: ప్రేమించిన యువకుడు పెళ్లికి నిరాకరించాడని మనస్తాపం చెందిన ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన వికారాబాద్ మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండలానికి చెందిన యువతి(19) హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో నర్సింగ్ కోర్సు చేస్తోంది. కాగా అదే తండాకు చెందిన నరేష్, యువతి చాలా కాలంగా ప్రేమించుకుంటున్నారు. గతంలో ఈ విషయం పెద్దలకు తెలియడంతో నిలదీశారు. అప్పట్లో బాలిక వయస్సు తక్కువగా ఉండటంతో మేజర్ అయ్యాక వివాహం చేసుకుంటానని అంగీకరించాడు. ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకున్నారు. బాలిక మేజర్ కావడంతో శుక్రవారం గ్రామంలో పంచాయితీ పెట్టి.. ఇచ్చిన మాట ప్రకారం పెళ్లి చేసుకోవాలని, వెంటనే ముహూర్తాలు చూద్దామని చర్చించుకున్నారు. అయితే నరేష్ తాను పెళ్లి చేసుకోనని చెప్పాడు. ఇంటి వద్ద నుంచే ఈ వ్యవహారాన్ని ఫోన్‌లో చూస్తున్న సదరు యువతి నరేష్ పెళ్లికి నిరాకరించాడని మనస్తాపానికి గురై ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. యువతిని పంచాయితీ వద్దకు తీసుకెళ్లేందుకు కొంత మంది వచ్చారు. ఎంతసేపటికీ తలుపులు తీయక పోవడంతో పగులగొట్టి ఇంటిలోకి వెళ్లారు. యువతి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించడంతో వెంటనే కిందకు దించి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే యువతి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ భీంకుమార్ తెలిపారు.

అడవి పందులను కట్టడి చేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీఆర్ఆర్

- విద్యుత్ కంచెలు ఏర్పాటు చేసి ప్రాణాలపైకి తెచ్చుకోకండి
- రైతులకు ఎమ్మెల్యే టీఆర్ఆర్ సూచన

పరిగి: అడవి పందుల నుంచి పంటలను కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం పరిగి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యుత్, అటవీశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయా ప్రాంతాల్లో పంటలను అడవి పందులు నాశనం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వాటి నివారణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయితే రైతులు విద్యుత్ కంచెలు ఏర్పాటు చేయరాదని సూచించారు. విద్యుత్ కంచెల కారణంగా ఈ ఏడాది నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో ఆరుగురు రైతులు మృత్యువాత పడ్డారని తెలిపారు. పంటలను రక్షించుకునే క్రమంలో వారే బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పొలాల్లో అడవి పందులు సంచరిస్తుంటే అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. వాటిని అంతం చేసేందుకు చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. అనంతరం పట్టణంలోని మినీ గ్రౌండ్‌లో డీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యుత్, అటవీ శాఖ అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

సందడే సందడి

కోట్‌పల్లి ప్రాజెక్టుకు శనివారం వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా పర్యాటకులు తరలివచ్చారు. అలుగు నీటిలో ఎంజాయ్ చేస్తూ గడిపారు. సెల్ఫీలు, ఫొటోలు దిగారు. గంటల తరబడి కుటుంబ సభ్యులతో సేద తీరారు. పలువురు ప్రాజెక్టు నీటిలో బోటింగ్ చేశారు.

– ధారూరు



అలుగు నీటిలో ఎంజాయ్ చేస్తున్న ప్రజలు

క్లుప్తంగా

గ్రామ పాలన అధికారుల నియామకం

ధారూరు: ధారూరు మండలంలోని 9 క్లస్టర్లకు గ్రామ పాలన అధికారులను నియమించినట్లు తహసీల్దార్ సాజిదాబేగం శనివారం తెలిపారు. ధారూరు జీపీఓ క్లస్టర్‌కు గడ్డల బిందు మాధూరీని, అంతారానికి, నాగారం ఇన్‌చార్జిగా బోయిని నరేశ్, దోర్నాల్ క్లస్టర్‌కు బి. భీమయ్య, గట్టెపల్లికి దాసరి నర్మద, మున్నూరుసోమారానికి బి. రామకృష్ణ, తరిగోపులకు బోయిని శ్రీనివాస్, కేరెళ్లికి బి. అంజమ్మ, నాగసమందర్, అల్లాపూర్ ఇన్‌చార్జిగా సయ్యద్ సమీర్, కుక్కింద క్లస్టర్‌కు బసయ్యగౌడ్‌ను నియమించినట్లు తహసీల్దార్ వివరించారు.

దుద్యాల్ మండలానికి ఐదు గురు..

దుద్యాల్: మండల వ్యాప్తంగా ఉన్న ఐదు క్లస్టర్లకు గాను జూనియర్ పంచాయతీ అధికారులను కేటాయించినట్లు తహసీల్దార్ కిషన్ తెలిపారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోలేపల్లి క్లస్టర్‌కు రెబ్బనమోని రమేశ్, లగచర్లకు కావలి శ్రీనివాస్, హస్నాబాద్‌కు పి గోపాల్, దుద్యాల్‌కు బంటు పక్కీరప్ప, చిలుముల్ మైల్వార్ క్లస్టర్‌కు మాటూర్ నర్సిములను కేటాయించినట్లు పేర్కొన్నారు.

తల్లీబిడ్డ అదృశ్యం

కేసు నమోదు


బిడ్డతో సుక్కమ్మ

బంట్వారం: తల్లీబిడ్డ అదృశ్యమయ్యారు. ఈ సంఘటన బంట్వారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ విమల తెలిపిన వివరాల ప్రకారం .. బంట్వారానికి చెందిన జాజికర్త సుక్కమ్మ (26) మూడేళ్ల వయస్సున్న బిడ్డ గౌతమిని ఎత్తుకుని 3వ తేదీన ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. తల్లీబిడ్డ గురించి కుటుంబీకులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భర్త విఠల్ ఫిర్యాదు మేరకు శనివారం మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో.. ఇద్దరికి గాయాలు


బోల్తా పడిన ఆటో

బొంరాస్‌పేట: రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలయ్యాయి. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా ధారూరు మండలానికి చెందిన వ్యక్తి శనివారం సాయంత్రం తన కారు నడుపుతూ ఎదురుగా ద్విచక్ర వాహనంపై వస్తున్న స్థానిక డిప్యూటీ తహసీల్దార్ చాంద్‌పాషాను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చాంద్‌పాషా కాలు విరిగింది. గాయపడిన అతనిని పోలీసులు కొడంగల్ ఆస్పత్రికి తరలించారు.

మరో సంఘటనలో..

మండల పరిధిలోని లింగన్‌పల్లికి చెందిన చంద్రు ఆటో నడుపుకుంటూ జాతీయ రహదారి నుంచి వెళ్తున్న క్రమంలో కొడంగల్–రేగడిమైలారం శివారు సమీపంలో చేరగానే ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ఈ ఘటనలో అతనికి స్వల్ప గాయాలయ్యాయి. దీన్ని గమనించిన స్థానికులు కొడంగల్ ఆస్పత్రికి తరలించారు.

తాగిన మైకంలో.. దంపతులపై దాడి

జగద్గిరిగుట్ట: బైక్ పై వస్తున్న దంపతులను కొందరు మద్యం మత్తులో అడ్డుకుని గాయపరిచిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరా ల ప్రకారం ఉత్తర ప్రదేశ్ కు చెందిన షబ్బీర్ అలీ, ఫాతిమా దంపతులు స్టేషన్ పరిధిలోని దేవేందర్‌నగర్‌లో నివసిస్తున్నారు. కాగా గురువారం అర్ధరాత్రి వీరు తమ బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా దేవేందర్‌నగర్‌కు చేరుకోగానే వీరిని అజీజ్, అతని స్నేహితులు బైక్‌ను అడ్డుకున్నారు. ఎందుకు ఆ పారని అడిగే లోపే అప్పటికే మద్యం తాగి ఉన్న వారు మూకుమ్మడిగా విచక్షణారహితంగా దాడి చేశారు. కళ్ల ముందే భర్తను కొడుతుంటే, ఆపేందుకు ప్రయత్నించిన భార్య ఫాతిమాపై కూడా దాడి చేసి గాయపర్చారు. ఇదంతా దగ్గర్లో ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డు కావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. తమను అన్యాయంగా కొట్టారని, నిందితులను కఠినంగా శిక్షించాలని బాధితులు ఫిర్యా దులో పేర్కొన్నారు.

మరోసారి తెరపైకి కరుణ!

- హాట్రిక్‌పై కన్నేసిన మండల మాజీ అధ్యక్షురాలు
- కాంగ్రెస్‌లో బీసీ మహిళా నేతగా అనుకూలత
- పార్టీ పరిశీలనకు నేతల ప్రతిపాదన


కరుణ, మాజీ ఎంపీపీ

బషీరాబాద్: జనరల్ స్థానంలో వరుసగా రెండు సార్లు విజయం సాధించి ఎంపీపీగా పనిచేసిన బషీరాబాద్ మండల పరిషత్ మాజీ అధ్యక్షురాలు కరుణ హాట్రిక్‌పై కన్నేశారు. అధ్యక్ష పీఠం బీసీ జనరల్ కావడంతో మరో సారి రేసులోకి వచ్చారు. ఇప్పటికే మహరాజుల కుటుంబం నుంచి వెంకటేష్ మహరాజ్ పేరు బలంగా వినిపిస్తోంది. అయితే మాజీ ఎమ్మెల్యేల భేటీ తర్వాతా రాజకీయ సమీకరణాలు వేంగగా మారుతున్నాయి. మండలంలో ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానంతో పాటు 12 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. ఈ స్థానాల్లో పోటీలో దింపేందుకు అధికార పార్టీ అభ్యర్థుల ఎంపికలో ముందువరుసలో ఉంది. గ్రామాల్లో ఆర్థికంగా, అంగబలంతో పాటు ప్రజాబలం కలిగిన ముగ్గురు అభ్యర్థుల పేర్లు ఇవ్వాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి స్థానిక మండల నాయకులకు సూచించారు. ఈ మేరకు శనివారం ఓ ఫంక్షన్ హాల్‌లో సమావేశమైన మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలకు ముగ్గురు అభ్యర్థుల చొప్పున ప్రాథమికంగా నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. అయితే బీఆర్‌ఎస్ నుంచి రెండు పర్యాయాలు ఎంపీపీగా పనిచేసి ఉమ్మడి జిల్లాలోనే ప్రత్యేక గుర్తింపు పొందిన కరుణను రంగంలోకి దించితే గెలుపు లభించే అవకాశం ఉంటుందని పార్టీ నాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు మహరాజుల కుటుంబం నుంచి ఇదివరకే వెంకటేష్ మహరాజ్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. అయితే తమ కుటుంబానికి ఎంపీపీతో పాటు జెడ్పీటీసీ టికెట్ కూడా కావాలని మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పెట్టిన షరతు, బీఆర్‌ఎస్ తాము రెండు టికెట్లు ఇస్తామని ఆఫర్ చేసిన క్రమంలో అధికార పార్టీ ఆచితూచి అడుగులు వేస్తోంది. ఇదే పదవికి యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి అనిల్‌కుమార్‌గౌడ్ కూడా పోటీ పడుతున్నారు. యువత నుంచి తనకు అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యేకు ఇప్పటికే వినతిపత్రం అందజేశారు. అలాగే మైల్వార్‌కు చెందిన శ్రీహరి ముదిరాజ్ పేరు కూడా వినిపిస్తోంది.

జెడ్పీటీసీ రేసులో ముగ్గురు!

జెడ్పీటీసీ స్థానానికి కాంగ్రెస్ సీనియర్ నేతలు అజయ్‌ప్రసాద్, రాకేష్ మహరాజ్ పోటీ పడుతున్నారు. అయితే ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌కు అభ్యర్థులు కూడా దొరకని దయనీయ పరిస్థితుల్లో అధికార పార్టీ నాయకులకు పదవుల గాలం వేస్తున్నారు. అందేకే ఈ పదవికి కూడా మూడో వ్యక్తి బరిలోకి వచ్చాడు. ఎంపీపీగా తనకు అవకాశం ఇవ్వకుంటే జెడ్పీటీసీగా పోటీ చేయడానికి అవకాశం కల్పించాలని పార్టీ నేతలను కోరుతున్నారు.

కార్యకర్తలు అభిప్రాయం తీసుకోండి : ఎమ్మెల్యే

పార్టీ మండల సీనియర్ నాయకులు గ్రామాల్లో పర్యటించి కార్యకర్తలు సూచించిన అభ్యర్థుల పేర్లనే ఇవ్వాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి శనివారం ఆదేశించారు. సోమవారం నుంచి మండలంలోని ప్రతి గ్రామంలో పర్యటించి గ్రామ కమిటీలు, కార్యకర్తలు, సీనియర్ నాయకులతో మాట్లాడి ఒక్కో ఎంపీటీసీ స్థానానికి ముగ్గురు అభ్యర్థులతో జాబితాను తయారు చేసి ఈ నెల 8లోపు ఇవ్వాలని సూచించినట్లు తెలిసింది. దీంతో మండల నాయకులు గ్రామాల పర్యటనకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

మరపురాని నేత ఇంద్రారెడ్డి


ఇంద్రారెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న సబితారెడ్డి తదితరులు

ఎమ్మెల్యే సబితారెడ్డి

చేవెళ్ల: మరపురాని మహానేత, ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడు ఇంద్రారెడ్డి అని ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. హోశాఖ మాజీ మంత్రి ఇంద్రారెడ్డి జయంతిని పురస్కరించుకొని శనివారం మండల పరిధి కౌకుంట్లలో ఆయన సమాధి వద్ద కుమారులు కార్తీక్‌రెడ్డి, కౌసిక్‌రెడ్డి, కల్యాణ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఇంద్రారెడ్డి జ్ఞాపకాలు, ఆశయాలు మరపురానివని పేర్కొన్నారు. నిరంతరం ఆయన ప్రజలకోసం తపించారని, వారి ఆశయాలకు అనుగుణంగా తమ కుటుంబం పనిచేస్తుందని తెలిపారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ పి.కృష్ణారెడ్డి, మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఎం.బాలరాజ్, పార్టీ మండల అధ్యక్షుడు పి.ప్రభాకర్, కరుణాకర్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, దర్శన్, రాజు, మానిక్యరెడ్డి, మాదవ్‌గౌడ్, కరుణాకర్‌రెడ్డి, నర్సింహులు, కృష్ణ, మల్లారెడ్డి, గోపాలకృష్ణ, అంజయ్య, శేఖర్, ప్రసాద్ పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య


సృష్టిత (ఫైల్)

కుషాయిగూడ: కుటుంబంలోని విభేదాలతో మనస్తాపం చెందిన ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన శనివారం చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. చర్లపల్లిలోని మధుసూదన్ రెడ్డినగర్‌కు చెందిన బత్తుల గోపాల్, ప్రసన్న దంపతులు గత మే నెలలో విడాకులు తీసుకున్నారు. ఈ క్రమంలో వారి కుమార్తె సృష్టిత (21) తల్లి ప్రసన్నతో కలిసి మధుసూదన్‌రెడ్డినగర్‌లో ఉంటుండగా...భర్త వేరుగా ఉంటున్నాడు. సృష్టిత డిగ్రీ చదువుతుండగా, తల్లి ప్రైవేటుగా ఉద్యోగం చేస్తుంది. శుక్రవారం ప్రసన్న రోజులానే ఉద్యోగానికి వెళ్లింది. ఆ సమయంలో కూతురు సృష్టిత ఇంట్లో ఒంటరిగా ఉంది. ఆ రోజు మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో తల్లి కుమార్తెతో ఫోన్‌లో మాట్లాడింది. తిరిగి సాయంత్రం 6:30 గంటలకు మరోమారు ఫోన్ చేస్తే సృష్టిత ఫోన్ లిఫ్ట్ చేయలేదు. పలుమార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో ఆందోళన చెందిన తల్లి ఇంట్లో కిరాయిదారులకు ఫోన్ చేసి కూతురు ఫోన్ లిఫ్ట్ చేయకపోవడాన్ని తెలిపి ఇంటికి వెళ్లి చూడమని కోరింది. వారు తలుపు తట్టి ప్రయత్నించినా ఎలాంటి సమాధానం రాలేదు. తలుపులు పగులగొట్టి లోనికి వెళ్లి చూడగా సృష్టిత తన గదిలో ఫ్యాన్‌కు వేలాడుతూ విగతజీవిగా కనిపించింది. దీంతో విషయాన్ని తల్లి ప్రసన్నకు తెలిపారు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. కాగా తల్లిదండ్రుల మధ్య ఉన్న విభేదాల వల్లే మనస్థాపం చెంది యువతి ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని భావిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

గెలిచేవారికే టికెట్!

సర్వే ఆధారంగానే జెడ్పీటీసీ అభ్యర్థుల ఎంపిక

- ఒక్కో నియోజకవర్గం నుంచి ముగ్గురి పేర్ల సేకరణ
- ఉమ్మడిజిల్లా నేతలతో ఇన్‌చార్జ్ మంత్రి శ్రీధర్‌బాబు భేటీ
- స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చ


ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నేతలతో సమావేశమైన మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: జెడ్పీటీసీ పీఠాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ చేజిక్కించుకోవాలని అధికార కాంగ్రెస్ భావిస్తోంది. ఉమ్మడి జిల్లా చరిత్రలో ఇప్పటి వరకు కాంగ్రెస్ గెలుపొందిన దాఖలాల్లేవు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉండటం, సీఎం రేవంత్‌రెడ్డి సైతం ఇదే ఉమ్మడి జిల్లాకు చెందిన వ్యక్తి కావడంతో ఈ ఎన్నికలను హస్తం పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఎలాగైనా మెజార్టీ జెడ్పీటీసీ స్థానాలతో పాటు జెడ్పీ పీఠాన్ని కైవసం చేసుకుని తీరాలని నిర్ణయించింది. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ సహా పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఆదేశం మేరకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శ్రీధర్‌బాబు శనివారం తన నివాసంలో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే కె.శంకరయ్య, తాండూరు ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేఎల్లార్, చేవెళ్ల ఇన్‌చార్జ్ భీంభరత్, రాజేంద్రనగర్ ఇన్‌చార్జ్ నరేందర్‌తో భేటీ అయ్యారు. సంస్థాగతంగా పార్టీ బలాలు, బలహీనతలు సహా స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అంశాలపై దిశానిర్దేశం చేశారు.

భేటీకి దూరం..

రంగారెడ్డి జిల్లాలో 27 మండలాలు ఉండగా, వీటిలో సరూర్‌నగర్, బాలాపూర్, హయత్‌నగర్, గండిపేట్, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్ పూర్తిగా జీహెచ్‌ఎంసీలో విలీనమయ్యాయి. మిగిలిన 21 జెడ్పీటీసీ స్థానాలు సహా వికారాబాద్ జిల్లాలోని 20 జెడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. పార్టీ గుర్తుపై నిర్వహించే ఈ ఎలక్షన్లను అధికార కాంగ్రెస్ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. మెజార్టీ స్థానాల్లో పార్టీ అభ్యర్థులే గెలుపొందే విధంగా వ్యూహాలు రచిస్తోంది. ఇందుకోసం ఒక్కో ఎమ్మెల్యే నుంచి ముగ్గురు అభ్యర్థుల పేర్లను సేకరించింది. ఎమ్మెల్యేలు లేని చోట పార్టీ ఇన్‌చార్జ్‌ల నుంచి అభ్యర్థుల పేర్లను సేకరించింది. వీరు ప్రతిపాదించిన అభ్యర్థులపై అంతర్గత సర్వే చేయించి, ప్రజల్లో ఆదరణ ఉన్న వ్యక్తికే టికెట్ ఇవ్వాలని నిర్ణయించింది. ఇదిలా ఉండగా బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సహా చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య కూడా అధిష్టానానికి పలువురి పేర్లను ప్రతిపాదించారు. కానీ ఈ భేటీకి మాత్రం దూరంగా ఉన్నారు. మొదటి నుంచి పార్టీ కోసం పని చేసిన గెలుపు గుర్రాలకే టికెట్ ప్రకటించనుంది.

ఆరు గ్యారంటీలే అస్త్రాలు

సంస్థాగతంగా పార్టీ కేడర్ మధ్య ఎలాంటి సమన్వయ లోపం తలెత్తకుండా చూసుకోవడంతో పాటు అన్ని స్థానాల్లోనూ గెలుపొందేలా ముందుకెళ్లాలని మంత్రి శ్రీధర్‌బాబు ఎమ్మెల్యేలకు సూచించారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, గృహాలకు 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, రుణమాఫీ, రైతు భరోసా, 24 గంటల ఉచిత కరెంట్, రూ.500లకే గ్యాస్ సరఫరా, వంటి పథకాలే ప్రధాన ప్రచారాస్త్రాలుగా ముందుకు వెళ్లాలని మార్గనిర్దేశం చేశారు. గత ప్రభుత్వ వైఫల్యాలు, ఈ రెండేళ్లలో కాంగ్రెస్ సాధించిన అభివృద్ధి, సంక్షేమాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన కొత్త వారికి కాకుండా ఏళ్ల తరబడి పార్టీనే నమ్ముకుని వాళ్లను బరిలోకి దింపడం ద్వారా సంస్థాగతంగా పార్టీ మరింత బలపడే అవకాశం ఉందని చెప్పినట్లు తెలిసింది.

ట్రాక్టర్ బోల్తా .. డ్రైవర్ మృతి

గచ్చిబౌలి: అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడటంతో డ్రైవర్ మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శశిపాల్ రెడ్డి తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపలి మండలం వెన్నచెర్ల గ్రామానికి చెందిన బింగి బచ్చన్న(33)నగరంలోని గుడిమల్కాపురం వలస వచ్చాడు. తన సోదరుడికి చెందిన ట్రాక్టర్‌కు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గచ్చిబౌలిలోని టీఎన్‌జీవోస్ కాలనీలో స్లాబ్ వేసేందుకు ట్రాక్టర్ ద్వార మిల్లర్‌ను తీసుకొని వస్తుండగా..శనివారం తెల్లవారుజామున టీఎన్‌జీఓస్‌కాలనీ సమీపంలో అదుపుతప్పి బోల్తాకొట్టి రోడ్డు పక్కన పడింది. దీంతో బచ్చన్న చక్రాల కింద పడటంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అపహరణ

చేవెళ్ల: ఇంటి ముంగిట పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. ఈ సంఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, బాధితుడి వివరాల ప్రకారం.. మారుతినగర్ కాలనీకి చెందిన సత్యనారాయణరెడ్డి.. తన స్ప్లెండర్ ప్లస్ బైక్‌ను ఎప్పటిలాగే ఇంటి ముందు పెట్టాడు. శనివారం ఉదయం బైక్ కనిపించలేదు. చుట్టు పక్కల వెతికారు. అయినా ఆచూకీ లభ్యం కాలేదు. పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించగా.. గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌ను తీసుకెళ్లినట్లు గుర్తించారు. అనంతరం బాధితుడు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

లోతుకుంటలో అగ్ని ప్రమాదం

బొల్లారం: లోతుకుంటలో శనివారం ఉదయం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఉదయం 11 గంటల సమయంలో ఓ సైకిల్ స్టోర్‌లో మంటలు చెలరేగి, పక్కనే ఉన్న ఓ ఫార్మసీ షాపుతో పాటు మొత్తం ఆరు దుకాణాల వరకు మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది ఆలస్యంగా చేరుకోవడంతో ప్రమాద తీవ్రత మరింత పెరిగింది. తిరుమలగిరి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని, స్థానికులతో కలిసి సైకిల్ షాప్ పైఅంతస్తులో ఉన్న గ్లోబల్ అకాడమీ హాస్టల్‌లో చిక్కుకున్న ఇద్దరు మహిళలను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది తరువాత మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

ఎస్‌ఐ యాదగిరి


మాట్లాడుతున్న ఎస్‌ఐ యాదగిరి

దుద్యాల్: స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ యాదగిరి హెచ్చరించారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందునా ఎవరైనా ఉద్దేశపూర్వకంగా రాజకీయ పార్టీలపై, కులమతాల పేరిట దుష్ప్రచారం చేసినా, అవమానకరమైన వ్యాఖ్యలు, రెచ్చగొట్టే ప్రసంగాలు చేయొద్దని సూచించారు. సోషల్ మీడియా వేదికగా తప్పుడు కథనాలు, ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆయా వ్యక్తులను టార్గెట్ చేసి మాట్లాడినా, ప్రసారాలు చేసినా అన్నీ ఎన్నికల నేరం కింద పరిగనింపబడుతాయని ఎస్‌ఐ వివరించారు.

ఎన్నికల కోడ్ అమలు దృష్ట్యా ప్రజలకు ఇచ్చే సూచనలు ..

- ఇతర ప్రాంతాలకు ప్రయాణించే సమయంలో తమ వెంట రూ. 50,000లకు మించి నగదు ఉండొద్దు.
- ఎన్నికల సమయంలో అక్రమంగా మద్యం పంపిణీ చేసినా, తమ దగ్గర ఉన్నా నేరమే.
- ఓటు కోసం రాజకీయ పార్టీల నుంచి, పోటీదారుల నుంచి ఎటువంటి బహుమతులు, నగదు, వస్తువు రూపేణ తీసుకోవడం నిషేధమే.
- ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా అందరు ప్రభుత్వానికి సహకరించాలి.
- లంచం, బెదిరింపులు, డబ్బు లేదా మద్యం పంపిణీ, కులమత భేదాల ఆధారంగా ప్రచారంచేయడం వంటివి చేయొద్దు.

పై విషయాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినా పలు రకాల సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ యాదగిరి హెచ్చరించారు.

స్థానిక సందడి !

- అభ్యర్థుల ఎంపికపై ఆయా పార్టీల్లో చర్చ
- రిజర్వేషన్లపై కొనసాగుతున్న ఉత్కంఠ

తాండూరు: పల్లెల్లో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. అన్ని పార్టీల నాయకులు పోరుకు సిద్ధమవుతున్నారు. రిజర్వేషన్లు, అభ్యర్థుల ఎంపికపై ఉత్కంఠ కొనసాగుతోంది. గెలుపు గుర్రాల కోసం ప్రధాన పార్టీలన్నీ అన్వేషణ మొదలు పెట్టాయి. జెడ్పీ చైర్మన్ పదవి బీసీ జనరల్‌కు కేటాయించిన నేపథ్యంలో ఆ సామాజిక వర్గం నేతలు పోటీకి సిద్ధమవుతున్నారు. తాండూరు నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు బలమైన కేడర్ ఉంది. నాయకులు, కార్యకర్తల సమావేశాలతో ఒక అడుగు ముందున్నారు. డటం.. రిజర్వేషన్‌ల రూపంలో అంది వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాయకులు పోటీకి సై అంటున్నారు.

గెలుపు గుర్రాలకే టికెట్లు

జిల్లాలో 20 జెడ్పీటీసీ స్థానాలు, 232 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ నెల 9వ తేదీ నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. మండలాల వారీగా గెలుపు గుర్రాలకు టికెట్లు కేటాయించేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ నేతలు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా ముఖ్య నాయకులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. అభ్యర్థుల ఎంపికలో నిమగ్నమయ్యారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ స్థానాల్లో బలమైన నాయకులను బరిలో దింపాలని భావిస్తున్నారు. ఇప్పటికే పలు మండలాల్లో అభ్యర్థుల విషయంలో నాయకుల మధ్య ఏకాభిప్రాయం కుదిరినట్లు సమాచారం. పలు మండలాల్లో నాయకుల మధ్య తీవ్ర పోటీ ఉన్నట్లు తెలిసింది. పెద్దేముల్ జెడ్పీటీసీ స్థానం ఎస్టీ రిజర్వ్‌డ్ కావడంతో ఐదు మంది టికెట్ కోసం ఆశిస్తున్నారు. అయితే జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ ఈ సారి పోటీకి దూరంగా ఉంటున్నట్లు తెలిసింది. దీంతో గిరిజన నాయకులు ఆ టికెట్ తమకే ఇవ్వాలంటూ నేతలను కోరుతున్నారు.

మందు, విందు

ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో ఆశావహులు ఉన్నారు. రిజర్వేషన్లు అనుకూలంగా వచ్చాయి.. తనకే టికెట్ వస్తోందంటూ ప్రచారం చేసుకుంటున్నారు. గ్రామస్థాయి నాయకులు, పార్టీ శ్రేణులకు మందు, విందుతో ఆకట్టుకునే ప్రయత్నాలు మొదలు పెట్టారు. రిజర్వేషన్లపై స్పష్టత రాకున్నా స్థానికంగా ఎన్నికల వేడి పుట్టిస్తోంది.

బలమైన అభ్యర్థుల కోసం బీఆర్‌ఎస్ వేట

స్థానిక ఎన్నికల్లో బలమైన అభ్యర్థులను బరిలో నిలిపి అత్యధిక స్థానాలు సొంతం చేసుకోవాలని బీఆర్‌ఎస్ నేతలు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించిన తర్వాత అలకబూనిన నాయకులను బీఆర్‌ఎస్‌లోకి తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే బషీరాబాద్ మండలంలో మహరాజుల కుటుంబానికి చెందిన మాజీ ఎమ్మెల్యే నారాయణరావును కలిసి బీఆర్‌ఎస్ పార్టీలో చేరాలని మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి కోరారు. అలాంటి ప్రణాళికనే మిగతా మండలాల్లో కూడా అమలు చేయనున్నట్లు సమాచారం. అంతేకాకుండా గతంలో మాదిరిగానే జెడ్పీ చైర్మన్ పదవిని కూడా తన ఖాతాలో వేసుకోవాలని చూస్తున్నారు. ఇందులో భాగంగా మాజీ ఎమ్మెల్యేలు వరుసగా సమావేశం అవుతున్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

8.400 కిలోల గాంజా స్వాధీనం

యాచారం: ఇద్దరు గంజాయి విక్రేతలను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 8.400 కిలోల గాంజాను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన నాగార్జునసాగర్– హైదరాబాద్ రహదారి గునుగల్ గేట్ వద్ద చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రం మల్కాన్‌గిరి జిల్లాకు చెందిన బలరామ్ కోబాసి, ఉంగా పడియామిలు ఇద్దరు.. హైదరాబాద్‌కు చెందిన నిరజ్‌కుమార్ యాదవ్‌కు రూ.80 వేలకు విక్రయించడానికి గంజాయిని తీసుకువచ్చారు. ఈ క్రమంలో శుక్రవారం గునుగల్ గేట్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న వీరిని.. అక్కడ బందోబస్తులో ఉన్న పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బ్యాగ్‌లను తనిఖీ చేయగా.. గంజాయి పట్టుబడింది. దీంతో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. గంజాయితో పాటు రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తమదైన శైలిలో విచారించగా.. ఒడిశా అటవీ ప్రాంతంలో పండించిన గాంజాను తెచ్చి, నగరంలో విక్రయిస్తుంటామని ఒప్పుకొన్నారు. వీరిద్దరిని శనివారం రిమాండ్‌కు తరలించామని సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు.

కేసీఆర్ పాయే.. భగీరథ నీళ్లు పోయే!

మాజీ మంత్రి సబితారెడ్డి ఆవేదన

- ఆడబిడ్డలకు మళ్లీ నీటికష్టాలు వచ్చాయని అసహనం

చేవెళ్ల: 'కేసీఆర్ పాయే.. భగీరథ నీళ్లు పాయే.. గ్రామాల్లో చిన్నపిల్లలకు ఏమిటి ఈబాధ' అని మాజీ మంత్రి సబితారెడ్డి అన్నారు. దివంగత నాయకుడు ఇంద్రారెడ్డి జయంతి సందర్భంగా శనివారం కౌకుంట్లకు వెళ్తున్న ఆమె అంతారంలో రోడ్డు పక్కన బిందెల్లో నీళ్లు పడుతున్న ఇద్దరు చిన్నారులను చూసి వాహనం ఆపారు. ఇంట్లో నల్లా నీళ్లు రావటం లేదా..? ఇక్కడ ఎందుకు పడుతున్నారని ప్రశ్నించగా.. నీళ్లు రావడం లేదని ఓ బాలుడు బదులిచ్చాడు. మీ అమ్మ ఎక్కడికి వెళ్లిందని అడగగా.. పనికి పోయిందని చెప్పాడు. అనంతరం అక్కడే ఉన్న గ్రామస్తులను పలకరించిన సబితారెడ్డి నల్లా నీళ్లు రావడం లేదా అని అడిగారు. వారం రోజులుగా భగీరథ నీళ్లు రావడం లేదని, ఓ వ్యవసాయ బావి మోటారు నుంచి నల్లా పైపు కనెక్షన్ తీసుకుని వాడుకుంటున్నామని చెప్పారు. దీంతో అసహనం వ్యక్తంచేసిన ఆమె కేసీఆర్ దిగిపోవడంతో ఆడబిడ్డలు, చిన్నారులకు మళ్లీ నీటి కష్టాలు వచ్చాయని, కాంగ్రెస్ పాలనలో పాత రోజులను గుర్తుకు తెస్తోందన్నారు.

వేడుక ముగిసె.. వ్యర్థాలు మిగిలే

చెరువు కట్ట కింద చెత్త డంప్

- నెలరోజులైనా తొలగించని వైనం
- దుర్వాసన, దోమలతో స్థానికుల ఇబ్బంది
- పట్టించుకోని అధికార యంత్రాంగం


చెరువు కట్టకింద డంప్ చేసిన చెత్త

తుర్కయంజాల్: వినాయక చవితి ఉత్సవాలు ముగిశాయి. గణనాథుడి నిమజ్జన క్రతువు అట్టహాసంగా జరిగింది. నెలరోజులు గడిచింది. కానీ చెరువు వద్ద సేకరించి, కట్టకింద డంప్ చేసిన వ్యర్థాలు మాత్రం అలాగే ఉన్నాయి. కుప్పలుగా పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. అయినా సంబంధిత అధికారులు చెత్త తొలగింపును విస్మరించారు. నేటికీ చెత్తాచెదారం తొలగించేందుకు టెండర్ ప్రక్రియను పూర్తి చేయకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలిచింది.

నాలుగు వేల విగ్రహాలు..

పురపాలక సంఘం పరిధి మాసబ్ చెరువులో గణనాథుల నిమజ్జన ప్రక్రియను అధికారులు విజయవంతంగా నిర్వహించారు. ఉన్నతాధికారులు మెప్పు పొందారు. కాగా.. సుమారు నాలుగు వేలకు పైగా ప్రతిమలు గంగమ్మ ఒడికి చేరాయి. ఆయా విగ్రహాలతో పాటు.. పూలు, పండ్లు, ఆకులు తదితర పూజా సామగ్రిని సైతం భక్తులు తెస్తుంటారు. అలా తెచ్చిన వాటిని సిబ్బంది సేకరించారు. అనంతరం వాటిని దూర ప్రాంతాలకు తరలించాల్సిన అధికారులు.. చెరువుకు రెండు వందల మీటర్ల దూరన డంప్ చేయించారు. నెలరోజులైనా ఆ వ్యర్థాలను అక్కడి నుంచి తీయకపోవడంతో సమీప కమ్మగూడ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వెలువడుతున్న దుర్వాసనతో ఇంట్లో ఉండలేక పోతున్నామని వాపోతున్నారు.

డంపింగ్ యార్డ్‌లా..

నిమజ్జన సమయంలో 24 గంటల పాటు శానిటేషన్ ప్రక్రియను అధికారులు నిర్వహించారు. ఆ సమయంలో బిజీగా ఉండటం, సిబ్బంది కొరతతో తడి, పొడి చెత్తను వేరుచేయకుండా ఒకే చోట డంప్ చేశారు. ఆ తరువాత అయినా దానిని వేరు చేయాలనే ఆలోచనను మరిచారు. ఆ తరువాత వరుసగా భారీ వర్షాలు కురవడంతో.. ఆ చెత్త పెద్ద సమస్యగా మారింది. గతంలో నిమజ్జన ప్రక్రియ ముగిసే వరకు ఇక్కడ డంప్ చేసి, ఆ తరువాత ఇతర ప్రాంతాలకు తరలించేవారు. కానీ ఈ సారి అలాగే వదిలేయడంతో ఆ ప్రాంతం డంపింగ్ యార్డ్‌ను తలపిస్తోంది. ఇదిలా ఉండగా.. చెత్త తొలగించకపోవడంతో ఈ ప్రాంతం పందులకు ఆవాసంగా మారిందని స్థానికులు పేర్కొంటున్నారు. అపరిశుభ్రత వాతావరణం వలన దోమల బెడద పెరిగిందని వాపోతున్నారు. దీని కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అధికారులు స్పందించి, నిమజ్జన వ్యర్థాలను వెంటనే తొలగించే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

> **తొలగిస్తాం..**
>
> సిబ్బంది కొరతతో చెత్త తరలింపు ఆలస్యం అయింది. వెంటనే టెండర్ ప్రక్రియను పూర్తి చేసి, వ్యర్థాలను తరలించే ఏర్పాట్లు చేస్తాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తాం.
>
> – వనిత, శానిటరీ ఇన్‌స్పెక్టర్, మున్సిపాలిటీ